

ముగిసిన సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునః పరిశీలనలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన నకిల వెంకటేష్, వెంకటలక్ష్మీ భార్గవి దంపతులు శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

సేవలు, మొక్కుబడులు నిలిపివేత



దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో మే ఒకటి నుంచి ఐదో తేదీ వరకు ఆర్జిత సేవలు, మొక్కుబడులు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఈఓ కె.సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అమ్మవారి దర్శనం మాత్రమే యథాతథంగా ఉంటుందని, భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

తీరం... మణిహారం

- సూర్యలంక, రామాపురం బీచ్‌ల్లో బోటింగ్ క్లబ్‌లు ఏర్పాటు
- ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధికి ప్రణాళికలు
- రెండు బీచ్‌లపై అధ్యయనాలు పూర్తి

చీరాల: బాపట్ల జిల్లాలో తీరం మణిహారంగా మారనుంది. జిల్లాలోని బాపట్ల సూర్యలంక, చీరాలలోని రామాపురం బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. జూలై చివరకల్లా ఈ రెండు బీచ్‌ల్లో బోటింగ్ షికారుకు ప్రైవేటు భాగస్వామ్యంతో క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ వెంకట మురళి వెల్లడించారు. దీంతో ఈ రెండు బీచ్‌లు అభివృద్ధి చెందితే మినీ గోవాగా మారనున్నాయి. ఇప్పటికే వాడరేవు నుంచి కఠారిపాలెం వరకు ఉన్న తీరప్రాంత రోడ్డు డబుల్ రోడ్డుగా విస్తరిస్తున్నారు. ఈ రెండు బీచ్‌ల్లో సుమారు 50కి పైగా రిసార్ట్‌లు ఉన్నాయి. సీఆర్‌జెడ్ నిబంధనలను పరిగణలోకి తీసుకుని తీరప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. ప్రైవేటు భాగస్వామ్యంతో పర్యావరణానికి ఎలాంటి హానీ,



తీరం ఒడ్డున నిర్మాణం చేస్తున్న రిసార్ట్

కాలుష్యం లేని ప్రాంతంగా ఈ రెండు బీచ్‌లను ప్రాథమికంగా గుర్తించారు. ఇప్పటికే ఇరవై మంది శాస్త్రవేత్తలు ఈ రెండు బీచ్‌ల్లో పర్యటించి అధ్యయనం చేశారు. పరిశుభ్రమైన ప్రాంతంగా జిల్లాలో ఈ రెండు బీచ్‌లే ఉన్నాయన్నారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. చీరాల కేంద్రంగా జీడిపప్పు ఉత్పత్తి అధికంగా ఉన్నందున విక్రయాలు, ఉత్పత్తులను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తాటిచెట్లు ఆధారంగా ఉత్పత్తులు పెంచేలా కల్లు గీత కార్మికులకు, బోటింగ్ షికారు జరిగేలా మత్స్యకారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. చీరాలలో అధికంగా తయారయ్యే చేనేత ఉత్పత్తుల పెంపు, ప్రదర్శన, అమ్మకాల కోసం కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. వాడరేవు వద్ద రెవెన్యూ అసోసియేషన్‌కు చెందిన ఒక ఎకరం భూమిని ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి ఈ భూమిని లీజుకు ఇవ్వడానికి పరిశీలన జరుగుతున్నాయన్నారు. పేరలి కెనాల్ బోటింగ్‌కు అనుకూల ప్రాంతంగా గుర్తించారు. అత్యవసరమైన అభివృద్ధి పనులకు గాను రూ.1.13 కోట్లు నిధులు కేటాయించారు.



వాడరేవు-కఠారిపాలెం డబుల్ లైన్‌గా విస్తరిస్తున్న దృశ్యం

వాడరేవు-పిడుగురాళ్ల రోడ్డుతో పెరగనున్న పర్యాటకులు

వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి ఏర్పాటుకు ఆమోదం తెలపడంతోపాటుగా రూ.667 కోట్ల నిధులను కూడా విడుదల చేయించారు. ఈ రోడ్డు వాడరేవు నుంచి పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా నకరికల్లు అడ్డరోడ్డు వరకు 81.5 కిమీ మేర వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వాడరేవు-పిడుగురాళ్ల వరకు 47 కిలోమీటర్లు వరకు నాలుగులైన్ల జాతీయ రహదారిగా నిర్మాణాన్ని చేస్తున్నారు. 2025 డిసెంబర్ నాటికి ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు, ప్రభుత్వం పనులను ముమ్మరంగా చేయిస్తుంది. ఈ రహదారి నిర్మాణంలో 37 కిలోమీటర్లు రోడ్డు బాపట్ల జిల్లా పరిధిలోనే ఉండటంతో జిల్లాకే



వేగంగా నిర్మాణం పూర్తి చేసుకుంటున్న వాడరేవు-పిడుగురాళ్ల నేషనల్ హైవే

తలమానికంగా మారనుంది. హైవే నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే జిల్లాకే మణిహారంలాగా ఉంటుందన్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు తక్కువ సమయంలో చేరుకోవడంతో పాటుగా తీరప్రాంతాలకు పర్యాటకులు అధికంగా వస్తారు.

బోటింగ్ షికార్‌తో మినీ గోవాగా మారే అవకాశం

బాపట్ల జిల్లాలోని రామాపురం, సూర్యలంక తీరాల్లో బోటింగ్ జూలై నుంచి బోటింగ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బోట్ షికారు అమల్లోకి వస్తే చీరాల, బాపట్ల తీరాలకు పర్యాటకులు పోటెత్తుతారు. జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం సముద్ర తీరప్రాంతాలకు ఏపీలో చాలా జిల్లాలతోపాటుగా తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికంగా వస్తారు. కార్తీక మాసంలో అధికంగా పర్యాటకులు వస్తుంటారు. అంతే గాక సినిమా షూటింగ్‌లకు చీరాల తీరం బాగా అనుకూలం, సినీ తారలకు నచ్చేలా రిసార్టులు, ప్రొడ్యూసర్లకు ఖర్చు తక్కువలో సినిమా చిత్రీకరణ చేసేలా మంచి లోకేషన్లు కూడా ఉన్నాయి. బోటింగ్ కూడా అందుబాటులోకి వస్తే మినీ గోవాగా రూపాంతరం చెందుతుంది.



రామాపురం తీరంలో సినిమా షూటింగ్ (ఫైల్)

పూలే జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి

బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



పూలే విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న ఎంపీ, కలెక్టర్

బాపట్లటౌన్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేసిన జ్యోతిరావుపూలే జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని బాపట్ల ఎంపీ తెన్నెటి కృష్ణప్రసాద్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ, కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత చీలురోడ్డు సెంటర్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే వివక్ష, అంటరానితనంపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. విజయవాడ నుంచి గూడూరు వరకు రూ.రెండు వేల కోట్లతో నాలుగో వరుస రైల్వేలైన్, రేపల్లె-తెనాలి మధ్య రెండో రైల్వే లైన్ మంజూరు అయ్యిందన్నారు. గుంటూరు నుంచి నిజాంపట్నం వరకు రూ.1200 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే మంజూరైందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి రూ.97.52 కోట్లు నిధులు వచ్చాయన్నారు. రూ.29 కోట్లతో బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, మాజీ ఎమ్మెల్సీ పోతుల సునీత, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్వో జి గంగాధర్ గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డి, బీసీ నాయకులు శంకరరావు, జయప్రకాష్ నారాయణ, వీరరాఘవయ్య, జి శ్రీనివాసరావు, కె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాలికావిద్యకు ప్రోత్సాహం



బల్లికురవ: ప్రభుత్వం బాలికావిద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ప్రతి ఒక్కరూ చదువుకుని విద్యావంతులు కావాలని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం బల్లికురవలోని కెజీబీవి సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు కేజీబీవీకి రూ.3.23 కోట్లతో 12 వసతి గదులు మంజూరుకాగా భూమిపూజతో శిలాఫలకాలు ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కెజీబీవీలో వసతి గదుల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు ప్రభుత్వం కేటాయించిందని 6 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బల్లికురవలో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో మంత్రి అర్జీలు స్వీకరించారు. వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై యంత్ర పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం

నిజాంపట్నం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులపాటు సముద్ర జలాలలో చేపల వేట నిషేధించినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సాయిసందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సముద్రంలో వివిధ చేపలు, రొయ్యల జాతుల సంతాన ఉత్పత్తి జరుగుతున్న సమయంలో ప్రభుత్వం ప్రతి ఏటా 61 రోజులపాటు వేట నిషేధం అమల్లోకి తెస్తుందన్నారు. ఈ సమయంలో రొయ్య, చేప జాతులు గుడ్లు పెట్టి సంతానోత్పత్తికి దోహదపడే సమయమన్నారు. వేట నిషేధ సమయంలో మండలంలోని మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లరాదని తెలియజేశారు. నిషేధాన్ని ఉల్లంఘించి వేటకు వెళ్లిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి



అద్దంకి రూరల్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపో ఆవరణను పరిశీలించారు. గ్యారేజ్‌లోని కార్మికులతో మాట్లాడారు. బస్సులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కండక్టర్‌లు, డ్రైవర్లు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎం, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈనెల 13, 14 తేదీల్లో విజయవాడలో జరగనున్న ఏపీ స్టేట్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు వీఎస్ఎస్ లలిత్, ఎస్.చరణ్ కుమార్, వి.హర్షిణి ఎంపికయ్యారని టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర పోటీల్లోనూ పతకాలు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శనివారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. శని, ఆదివారాలు యార్డుకు సాధారణ సెలవులు, సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవం పురస్కరించుకుని మిర్చి యార్డుకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో రైతులు తమ సరుకును యార్డుకు తీసుకురావద్దని కోరారు. సోమవారం అర్ధరాత్రి నుంచి రైతుల సరుకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మంగళవారం యథావిధిగా యార్డులో క్రయ విక్రయాలు కొనసాగుతాయని ఆమె వివరించారు.

వక్ఫ్ సవరణపై భగ్గుమన్న ముస్లింలు

- బాపట్లలో భారీ నిరసన ర్యాలీ
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ముస్లిం సోదరులు
- అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

బాపట్లటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం జానీ తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం బాపట్ల అంజుమన్ ఏ ఇస్లామియా ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది ముస్లిం సోదరులు నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. నినాదాలతో బాపట్ల హోరెత్తింది. ముస్లిం సోదరులుకు సంఘీభావంగా బాపట్లలోని వివిధ రాజకీయపార్టీల నాయకులు, లౌకికవాదులు ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. తొలుత పాత బస్టాండ్ వద్ద గల అంజుమన్ ఇస్లామియా మసీదు నుండి బయలుదేరిన ర్యాలీ చీలు రోడ్డు, పాత బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం కార్యాలయానికి చేరుకుంది. అంబేద్కర్ సర్కిల్‌లో ముస్లిం సోదరులు మానవహారంగా ఏర్పడ్డారు. అబ్దుల్ రహీం జానీ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా ముస్లింల హక్కులను కాలరాసేందుకు అనేక నల్ల చట్టాలు చేస్తుందన్నారు. దేశంలో అనేక సమస్యలు ఉన్నా వాటిని పట్టించుకోకుండా ముస్లింలపై కక్ష కట్టి నిరంకుశ పాలన కొనసాగిస్తుందన్నారు. అంజుమన్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ కరీం మాట్లాడుతూ వక్ఫ్



బాపట్లలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు



తహసీల్దార్ సలీమాకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం సోదరులు

అంటే ముస్లిం సోదరులు తమకు ఉన్న సంపదలో అల్లా పేరిట దానం చేసే ఆస్తి అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి ముస్లిం సోదరులకు వక్ఫ్ ఆస్తులు ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డులో అన్యమతస్తులను భాగస్వామ్యాన్ని కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముస్లింలు, క్రైస్తవుల హక్కులకు భంగం కలిగిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దురాగతాలపై సమిష్టిగా పోరాడి వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. సమాజ్‌వాద్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి గొర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ముస్లిం వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఖాలీలుల్లా ఖాన్, జబీబుల్లా, సీపీఎం పట్టణ నాయకుడు కే శరత్, సీపీఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారావు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు చల్లా రామయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

ఓటరు కార్డులకు డోర్ నంబర్లు పక్కాగా ఉండాలి

గుంటూరు వెస్ట్: ఓటర్ కార్డులకు డోర్ నంబర్లు పక్కాగా ఉండాలని డీఆర్వో షేక్ ఖాజావలి చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం తుది ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. దీనికి రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు ఎంతో కీలకమని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకునే క్రమంలో ఓటరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాబితా సిద్ధం చేయాలని చెప్పారు. రానున్న ఎస్ఎస్ఆర్‌కు ముందుగానే పైలెట్‌గా పట్టణంలో ఒక పోలింగ్ బూత్‌లో ఓటర్ల డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేసి ఒకే కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా పరిశీలన చేయాలన్నారు. ఆధార్ కార్డుకు ఓటరు కార్డు అనుసంధాన అంశం కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో ఉందని చెప్పారు. మరణించిన వారి ఓట్లు జాబితాలో లేకుండా, డబుల్ ఎంట్రీలు కూడా పరిశీలన చేయాలని తెలిపారు. జనవరి 5, 2026 తుది ఓటరు జాబితా సిద్ధమవుతుందని డీఆర్వో వివరించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, జీఎంసీ అదనపు కమీషనర్ సి.ఓబులేశు, డిసిలు డి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు టీచర్ బదిలీలు, ఉద్యోగోన్నతులపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు, సీనియార్టీ జాబితాలపై శనివారం సాయంత్రం 4.00 గంటలకు జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహమ్మద్ ఖాలీద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ పాల్గొని ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

రుణాల రికవరీలో చినగంజాం ప్రథమ స్థానం

చినగంజాం: 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేసి నూరు శాతం రికవరీ చేపట్టిన డీఆర్‌డీఏ చినగంజాం శాఖకు జిల్లాలో ప్రథమ స్థానం దక్కినట్లు ఏపీఎం జీ పెద సుబ్బారావు తెలిపారు. శుక్రవారం బాపట్లలో డీఆర్‌డీఏ పీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష కార్యక్రమంలో చినగంజాం శాఖకు ప్రశంసాపత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఆర్థిక సంవత్సరంలో రూ.7 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించగా రూ.9.56 కోట్లు లక్ష్యాన్ని పూర్తిచేసి నూరు శాతం రికవరీలు సాధించినందుకు తమకు జిల్లాలో ప్రథమంగా గుర్తించి ప్రశంసాపత్రం అందజేసినట్లు ఆయన వివరించారు. జిల్లా ప్రథమంగా చినగంజాం శాఖ గుర్తింపు పొందడం పట్ల ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మణాచారి, శ్రీనిధి మేనేజర్ కరుణాకర్‌లు చినగంజాం టీంని అభినందించినట్లు తెలిపారు.



పీడీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న చినగంజాం ఏపీఎం సుబ్బారావు, బృందం

డ్రోన్ల వినియోగంతో సమయం ఆదా

కొరిటెపాడు(గుంటూరు): పురుగుమందుల పిచికారీకి డ్రోన్ల వినియోగంతో రైతులకు సమయం ఆదా అవుతుందని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక కృషి భవన్‌లో శుక్రవారం సాయంత్రం డ్రోన్ల నమూనాలను రైతుల అవగాహన కోసం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్‌కేవీవై పథకం ద్వారా రైతుల గ్రూపులకు 80 శాతం సబ్సిడీపై కిసాన్ డ్రోన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. డ్రోన్ల తయారీదారుల ప్రతినిధులు రవికుమార్, సుధీర్ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు డ్రోన్లను కొనుగోలు చేయడానికి అన్ని బ్యాంకులకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ ప్రతినిధులు, ఏపీ ఆగ్రోస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడుగా జాష్ రత్నాకర్ నియామకం



రేపల్లె రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా ఇంటెలెక్చువల్ ఫోరం జిల్లా అధ్యక్షుడుగా రేపల్లెకు చెందిన కర్రా జాష్ రత్నాకర్ నియమితులయ్యారు. రత్నాకర్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. రత్నాకర్‌కు నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. రత్నాకర్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎన్‌ఓ ఉన్నత పాఠశాలకు వాచ్‌మన్ నియామకం

కారంచేడు: కారంచేడు గ్రామంలో 1956వ సంవత్సరం నుంచి ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించిన యార్లగడ్డ నాయుడమ్మ ఓరిఎంటల్ (కం) ఉన్నత పాఠశాల పునః ప్రారంభానికి సిద్ధమయ్యింది. దీనిలో భాగంగా పాఠశాలకు వాచ్‌మన్ నియామక ఉత్తర్వులను ఒంగోలు డీఈఓ ఏ కిరణ్ కుమార్ విడుదల చేశారు. గతంలో ఇదే పాఠశాలలో విధులు నిర్వహించిన టీ ఏడుకొండలును పాఠశాల మూతపడటంతో ప్రకాశం జిల్లా మైనంపాడు ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. ఇప్పుడు మరలా పాఠశాల పునఃప్రారంభానికి సిద్ధమవ్వడంతో మొదటగా వాచ్‌మన్ నియామం చేపట్టడంతో గ్రామస్తుల్లో పాఠశాల పునః ప్రారంభంపై నమ్మకం ఏర్పడింది. ఇక నుండి పాఠశాలలో విద్యార్థులు చేరడానికి అడ్మిషన్లు ప్రారంభిస్తారు. ఆపై అవసరమైన ఉపాధ్యాయుల నియామకాలు కూడా చేపడతారు.కారంచేడు గ్రామంలో ఉన్నత పాఠశాల పునః ప్రారంభం కానుండటంతో మంచి రోజులు వస్తున్నాయని గ్రామస్తులు చెప్పుకుంటున్నారు.

భూమిలో పోషకాలు పెంపొందించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీపీఎంయు వాణిశ్రీ

భట్టిప్రోలు (కొల్లూరు): భూమిలో సారం పెంచుకొని పోషక విలువలు పెంపొందిచుకోవడంపై రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎంయు వాణిశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని ఐలవరంలో ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 27 రకాల విత్తనాలను కలుపుకొని భూమిలో చల్లుకోవడం ద్వారా భూమికి బలాన్ని అందించే పోషకాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా పీఎండీఎస్ విత్తనాలను కిట్‌లను సిద్ధం చేసి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్‌కుమార్, అడిషనల్ డీపీ మోహన్, ఎస్ఎఫ్ఏ వర్ధనమ్మ, యూనిట్ ఇన్‌చార్జి ఐసీఆర్. పీస్ పాల్గొన్నారు.

హైలెస్సా..హైలెస్సాకు విరామం

- రెండున్నర నెలల పాటు సముద్రంలో వేట నిషేధం
- నెలకు రూ.10వేలు ఇచ్చి ఆదుకున్న జగన్
- సాయంపై నోరు మెదపని చంద్రబాబు
- ఆందోళనలో మత్స్యకారులు



సముద్రంలో వేటకు బయలుదేరుతున్న మత్స్యకారులు



వాడరేవులో తీరం ఒడ్డున నిలిపిన పడవలు

చీరాల: సముద్ర తీర ప్రాంతాల్లో నిత్యం వినిపించే హైలెస్సా... హైలెస్సా... అనే మాటలు... మత్స్యకారుల సందడి... సముద్రంలో బోట్లు ఇకపై కనిపించవు. సముద్రం బోసిగా దర్శనమివ్వబోతోంది. ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి రెండు నెలల పాటు వేటపై నిషేధాజ్ఞలు జారీ చేయడమే అందుకు కారణం. వేట తప్ప మరో పని తెలియని మత్స్యకారులకు ఈ రెండు నెలలు కష్ట కాలమే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధ కాలంలో ఒక్కొక్క మత్స్యకారునికి నెలకు రూ.10 వేలు ఇచ్చి ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేట నిషేధ సాయం నిలిపివేసింది. గతేడాది ఇవ్వాల్సిన మత్స్యకార వేట నిషేధ సాయం నేటికీ అందించలేదు. గంగపుత్రులపై చంద్రబాబు కపట ప్రేమ ఒలకబోస్తున్నారని మత్స్యకారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికే తీరంలో వారం రోజుల పాటు వేట చేసినా మత్స్యసంపద సరిగ్గా దొరక్కపోవడంతో నానా కష్టాలు అనుభవిస్తున్నారు. మత్స్యకారులకు ఈ వేట నిషేధం పెద్ద సమస్యను తలపిస్తుంది. జిల్లాలోని చీరాల, పర్చూరు, బాపట్ల, రేపల్లె, అద్దంకి, వేమూరు నియోజకవర్గాల్లో మత్స్యకార జనాభా 53,000 మంది ఉన్నారు. సముద్రంలో వేటకు వెళ్లే వారు 16,500 మంది. అధికారులు ఇప్పటివరకు సర్వే చేసిన సమాచారం మేరకు ఈ ఏడాది 12,350 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. వేట నిషేధ సమయంలో 18 వేలకు పైగానే మత్స్యకారులు ఇంటి వద్ద ఉంటూ వలలకు మరమ్మతులు చేసుకుంటుంటారు.

కుటుంబ పోషణ కష్టంగా

సాధారణంగా వాడరేవు మత్స్యకారులు కృష్ణా జిల్లా మచిలీపట్నం, నెల్లూరు జిల్లా రామయ్యపట్నం వరకు వేటకు వెళ్లి గురకా, పాములు, బొంత, కూనాము, వంజరం, పండుగప్పలు లాంటి చేపలను పట్టుకొస్తుంటారు. కానీ నేడు సముద్రంలో వేట ప్రస్తుతం ఆశాజనకంగా లేకపోవడం వలన మత్స్యకారులు తమ బోట్లను చిన్న జెట్టీ వద్ద, వలలను తీరం ఒడ్డున నిలుపుదల చేస్తున్నారు. వేటలేక నిషేధ సమయం ఆసన్నమవ్వడంతో మత్స్యకారులు కుటుంబ పోషణ కోసం అవస్థలు పడుతున్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనందిస్తున్నామని పాలకులు మాటల్లో చెబుతున్నారే తప్ప చేతల్లో చూపించడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 నుంచి అమలు

ఈనెల 15 నుంచి జూన్ 15 తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిలుపుదల చేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు ప్రకటించారు. ప్రతి ఏటా ఈ సమయంలో సముద్రంలో చేపలు పునరుత్పత్తి జరుగుతుంది. దీంతో సముద్రంలో పూర్తిగా వేటను నిలుపుదల చేస్తుంటారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో 2019 నుంచి 2023 జూన్ వరకు వేట నిషేధ సాయం ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.10వేలు సాయం అందించారు. 2024 జూన్‌లో ఇవ్వాల్సిన నిషేధ సాయం నేటికి ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వేట నిషేధంలో చంద్రబాబు సర్కారు కనికరించిద్దో....లేదో వేచి చూడాలి మరీ. ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.20,000 ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం మళ్లీ రీసర్వే అంటూ మెలిక పెట్టింది. మత్స్యకారులు వేటకు వెళ్లని సమయాల్లో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వేట నిషేధంలో మత్స్యకారులకు వేట నిషేధం సాయం ఇవ్వలేదు. వేట తప్ప మరే ఇతర పనులు తెలియని మత్స్యకారులు ప్రభుత్వం ఇచ్చే సాయం కోసం కళ్లల్లో ఒత్తులేసుకుని ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం ఇచ్చే నిషేధ సాయం జీవనభృతి త్వరగా అందించాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.

జీవనభృతిని త్వరగా అందించాలి

మత్స్యకారులకు గతసంవత్సరం వేట నిషేధంలో అందించని జీవన భృతి ఏడాదికి రూ.20,000 పాలకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి రెండేళ్లకు కలిపి ఒక్కో మత్స్యకారుడికి రూ.40 వేలు ఇస్తేనే మేము బతకగలం. ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు మత్స్యకార సాయం త్వరగా అందించి మత్స్యకారులను ఆదుకోవాలి. అలానే మత్స్యకారులకు రావాల్సిన ఇతర పథకాలకు నిధులు మంజూరు చేయాలి. కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్న తమను ఆదుకోవాలి.

–ఎస్.నూకాలు, వాడరేవు

నివేశన స్థలం కబ్జాకు కూటమి నేత పథకం

రెవెన్యూ, పోలీస్ అధికారుల ఓవరాక్షన్



బల్లికురవ: మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో దళితులకు సంబంధించిన నివేశన స్థలాన్ని గ్రామ కూటమి నేత కబ్జా చేసేందుకు పథకం వేసుకున్నాడు. ఈ పథకానికి రెవెన్యూ, పోలీస్ అధికారులు సహకారం అందించటంతో శుక్రవారం రాత్రి రాళ్లు వేసేందుకు ప్రయత్నించాడు. స్థల యజమాని బైటు చిన్నామ్మాయి ఈ స్థలం అనాథ పిల్లలకు సంబంధించిందని, అనాధలకు అన్యాయం చేస్తారా అని అధికారుల ముందు వాపోయింది. ఈ స్థలం విషయమై అనాధ పిల్లలకే చెందాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులకు విన్నవించినా కూటమి నేతలకే మద్దతు ఇస్తున్నారని వాపోయింది. దళితులమైన తాము వైఎస్సార్‌సీపీకి ఓటు వేశామన్న అక్కసుతోనే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బాధితురాలు వాపోయింది.

జెడ్పీ పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలి

గుంటూరుఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల వేతనాల్లో నుంచి మినహాయిస్తున్న నిధులు సకాలంలో జెడ్పీ పీఎఫ్ ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసుకు ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలోని సీఈవో చాంబర్లో జ్యోతిబసును కలిసి ఎస్టీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. సీఈవోను కలసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు కమతం ఉన్నారు.

కలంపై కక్షకు నిరసన

- సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, మరికొందరు పాత్రికేయులపై అక్రమ కేసులు
- నిరసనగా ఆందోళనకు దిగిన పాత్రికేయులు
- బాపట్లతోపాటు జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- తక్షణం కేసు ఉపసంహరించుకోవాలని డిమాండ్
- అధికారులకు వినతులు
- సర్కార్ తీరుపై మండిపడుతున్న ప్రజాస్వామ్య వాదులు



బాపట్లలో జిల్లా కలెక్టర్ వెంకట మురళికి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కలంపై కూటమి సర్కార్ కక్షగట్టి అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు, ప్రజాసంఘాలు కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. పాత్రికేయులపై కేసులు పెట్టి పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను టీడీపీ వారు హత్య చేసిన విషయాన్ని వెలుగులోకి తెచ్చిన సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితో పాటు ఆరుగురు పాత్రికేయులపై ప్రభుత్వం కేసులు పెట్టించడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బాపట్లలో పాత్రికేయులు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తక్షణం సాక్షి పాత్రికేయులపై పెట్టిన కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ వెంకట మురళికి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోనూ పాత్రికేయులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాత్రికేయులు బి.రమణారెడ్డి, ఆర్.ధనరాజ్, కె.ఉమా మహేశ్వరరావు, యు. శ్రీనివాసరావు, ఎ.కోటేశ్వరరావు, బొట్టు కృష్ణ, సాల్మన్‌రాజు, నారాయణ, కాశిం తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటూరులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు



ఉప్పుటూరులో ఎద్దుల పోటీలలో పాల్గొన్న ఎడ్ల జతలు

పర్చూరు(చినగంజాం): ఉప్పుటూరులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు జోరుగా సాగుతున్నాయి. తిరునాళ్లను పురస్కరించుకొని గ్రామంలో రాష్ట్ర స్థాయి పోలురాదా ఎడ్ల బలప్రదర్శన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇసుక బస్తాలతో ఉన్న చక్రాలు తిరగని ఎడ్ల బండిని నిర్ణీత సమయంలో ఎక్కువ దూరం లాగిన ఎడ్ల జతను విజేతగా ప్రకటిస్తారు. విజయం సాధించిన ఎడ్ల జతలకు వరుసగా రూ 50 వేలు, రూ 40 వేలు, రూ 30 వేలు, రూ 20 వేలు బహుమతులుంటాయని నిర్వాహకులు తెలిపారు. వీటితో పాటు కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదటి రోజు సీనియర్స్ విభాగంలో తొమ్మిది ఎడ్ల జతలు పోటీ పడుతున్నాయని తెలిపారు. ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీలకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బల్లికురవ ఎస్ఐని సస్పెండ్ చేయాలి

వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి



అద్దంకి రూరల్: పక్షపాత ధోరణితో టీడీపీకి కొమ్ముకాస్తున్న బల్లికురవ ఎస్సై నాగరాజును సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. బల్లికురవ మండలంలోని ప్రజలంతా ఐకమత్యంగా, కులమతాలకు, పార్టీలకతీతంగా నిర్వహించుకునే ఈర్ల గంగమ్మ తిరునాళ్లలో ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ వారికి ప్రభలు కట్టుకునేందుకు అనుమతి ఇవ్వకపోవటం ఎస్సై పక్షపాత ధోరణికి నిదర్శనమన్నారు. తిరునాళ్లకు కాని, దేవాలయం వైపు కాని వైఎస్సార్ సీపీ నాయకులు రాకుండా చేస్తానని చెప్పటం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా టీడీపీ వారికి తిరునాళ్లలో ప్రభలు కట్టేందుకు అనుమతులు ఇచ్చారన్నారు. ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న కూటమి నాయకులు ప్రజల్లోని వెళ్లే ధైర్యం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై సోషల్ మీడియాలో నీచంగా మాట్లాడించటం చంద్రబాబునాయుడు నైతికంగా దిగజారడన్నారు. ప్రశాంతంగా ఉండే బల్లికురవ మండలంలో గత వారం ప్రభలు కట్టేందుకు అప్పటి ఎస్సై జీవీ చౌదరి అనుమతులు ఇస్తే కొత్తగా వచ్చిన ఎస్సై అనుమతులు వైఎస్సార్‌సీపీ ఇవ్వకపోవటం ఏమిటన్నారు. ప్రశాంతంగా ఉండే అద్దంకి నియోజకవర్గంలో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న నాగరాజు లాంటి ఎస్సైని ఉన్నతాధికారులు కల్పించుకుని సస్పెండ్ చేయాలన్నారు.

బొబ్బర్లంక ఎస్టీ కాలనీ కుటుంబాలను ఆదుకోవాలి



ఆర్డీఓ నేలపు రామలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, కేవీపీఎస్, ఐద్వా సంఘాల నాయకులు

రేపల్లె రూరల్: వెట్టిచాకిరికి గురైన బొబ్బర్లంక ఎస్టీ కాలనీ కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కూలీలను క్రయవిక్రయాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సీపీఎం, కేవీపీఎస్, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, ఎస్టీ కాలనీవాసులు శుక్రవారం ఆర్డీఓ నేలపు రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ అమ్మకాలు, కొనుగోలు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మణిలాల్, అగస్టీన్, నాంచారమ్మ, ఆశీర్వాదం, డానియేలు తదితరులు పాల్గొన్నారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో గురువారం 589 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మినట్టు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 423 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,225, గరిష్ట ధర రూ.12,225, మోడల్ ధర రూ.11,550, కాయలు 166,బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10.400, గరిష్ట ధర రూ.11,800, మోడల్ ధర రూ.11,550, మొత్తం 441.750 క్వింటాళ్లు అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.

యార్డులో 1,27,104 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,15,943 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,27,104 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,600 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 54,603 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.